
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
27-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

వర్షానికి నేలకొరిగిన వృక్షం.. 2





2 విస్తారంగా వర్షాలు.. ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో

## గంగమ్మవాగు బ్రిడ్జి రోడ్డు పనుల పరిశీలన



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి వద్ద గంగమ్మ వాగు బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. దీంతో తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టారు. పనులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం సాయంత్రం పనులు పరిశీలించారు. త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు.



## ఇందూరులో హీరోయిన్ ఆషికా సందడి

ఇందూరులో హీరోయిన్ ఆషిక రంగనాథ్ సందడి చేసింది. నగరంలోని హైదరాబాద్ రోడ్డులోని ఓ జ్యుయలరీ షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొంది ఈ తార. ఆమెను చూసేందుకు ఫ్యాన్స్ తరలివచ్చారు. ఈ సందర్భంగా స్టెప్పులు వేసి ఫ్యాన్స్‌ను అలరించింది. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి యువత, మహిళల టేస్ట్‌కు తగిన జ్యుయలరీ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

– అక్షరటుడే, ఇందూరు

## మున్నూరుకాపు కల్యాణ మండపం అభివృద్ధికి కృషి



**అక్షరటుడే, నందిపేట/ఆర్మూర్:** మండలకేంద్రంలో మున్నూరుకాపు సంఘం కల్యాణ మండప అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌కుమార్ రెడ్డి అన్నారు. నందిపేటలోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కల్యాణ మండపంలో డైనింగ్ హాల్‌తోపాటు ఇతర అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక బాధ్యత అధిష్ఠానిదేనన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నందిపేట్ మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో భారీగా చేరికలు..

నందిపేట్ మండలంలోని సీహెచ్ కొండూరులో బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ పాల్గొన్నారు.



# అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు

▶ లింబాద్రిగుట్ట కింది భాగంలో అనుమతులు లేకుండానే వెలిసిన భవనాలు ▶ గుట్టకు వచ్చే భక్తులకు అద్దెకు ఇస్తున్న వైనం ▶ పట్టించుకోని అధికారులు

భీమ్‌గల్ శివారులోని లింబాద్రి గుట్ట కింది భాగంలో ప్రభుత్వం గతంలో కొంతమంది అసైన్డ్ భూమి పట్టాలు అందజేసింది. లింబాద్రి గుట్ట లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయానికి ఇటీవల భక్తుల తాకిడి పెరిగింది. గుట్ట కింది భాగంలో ఉన్న అసైన్డ్ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడాబాబులు కన్నేశారు. ఆయా భూముల యజమానుల నుంచి వాటిని కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే గదులు, షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. రెండేళ్ల క్రితం అటు నాయకులను, ఇటు అధికారులను మచ్చిక చేసుకుని పలు నిర్మాణాలను పూర్తి చేశారు.

**అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండానే భవనాలు నిర్మిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పేదలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం అసైన్డ్ భూములను ఇస్తోంది. అయితే వీటిని అమ్ముకోవడానికి వీలు లేదు. అలాగే ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దు. అయినా కూడా కొందరు బడా బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల పేదల నుంచి భూములు కొనుగోలు చేసి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు.** – అక్షరటుడే, భీమ్‌గల్

### చర్యలు శూన్యం..

అసైన్‌మెంటు భూముల్లో పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు వెలుస్తున్నా రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు పూర్తికాగా.. అధికారులు వాటికి ఇంటి నంబర్లు కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే లింబాద్రిగుట్ట పరిసరాలు నేడు అక్రమ నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రభుత్వ అధికారిక సమావేశాలు సైతం అక్రమంగా నిర్మించిన ఫంక్షన్ హాళ్లలో చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వారి అండదండలతోనే ఈ నిర్మాణాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### నోటీసులు ఇచ్చి..

అక్రమ నిర్మాణాలపై అధికారులు నోటీసులు అందజేసి చేతులు దులుపేసుకున్నారు. అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని సంబంధిత భూ యజమానులకు నోటీసులు అందజేశారు. ఇదివరకు పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిసినప్పటికీ అటు మున్సిపల్ అధికారులు కానీ ఇటు రెవెన్యూ అధికారులు కానీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సంబంధిత కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

### ఇంటి నంబర్లు కేటాయించలేదు

లింబాద్రిగుట్ట శివారులోని సర్వే నంబర్ 882 లో నిర్మాణాలకు, కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఆ నిర్మాణాలకు ఇంటి నంబర్లు సైతం కేటాయించలేదు. ఈ నిర్మాణాలు రెండేళ్ల క్రితం చేపట్టారు. అక్రమ నిర్మాణాల విషయమై ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

– గోపు గంగాధర్, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్

## గుంతల రోడ్డుతో అవస్థలు



**నగరంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిఖిల్‌సాయి చౌరస్తా సిగ్నల్ వద్ద బస్వా గార్డెన్‌వైపు వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.**

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## బంజారాలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉమేష్ యాదవ్

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** బంజారాలు ఐక్యమత్యంతో ఉంటూ అన్నిరంగాల్లో రాణించాలని, ఆల్ ఇండియా బంజార సేవ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ అన్నారు. బర్ధిపూర్ శివారులోని బృందావనం గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన బంజారా ఆత్మీయ సమ్మేళనం ఆయన మాట్లాడారు. కర్ణాటక, మహారాష్ట్రలలో ముగ్గురు బంజారాలకు మంత్రి పదవులు ఇచ్చారని, కానీ తెలంగాణలో కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బంజారాల జనాభాకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు టికెట్లను కేటాయించాలని కోరారు. ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ.. తాను గత ప్రభుత్వంతో కొట్లాడి తండాలను గ్రామ పంచాయతీలుగా చేయించానన్నారు. బంజారాలు సేవాలాల్ మహారాజ్, చరిత్ర తెలుసుకోవాలని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో బంజారాలు గెలవాలన్నారు. తండాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 33 జిల్లాల ఏఐబీఎస్ఎస్ అధ్యక్షులు, నిజామాబాద్ జిల్లా బంజార ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అనర్హులకు రేషన్ కార్డులు అందితే చర్యలు తప్పవు



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, బోధన్:** రేషన్ కార్డుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే అధికారులను సస్పెండ్ చేయిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకే రేషన్ కార్డులు అందాలని అధికారులకు సూచించారు. అనర్హులకు కేటాయించినట్లు తెలిస్తే మాత్రం సంబంధిత అధికారుల సస్పెన్షన్ తప్పదని పేర్కొన్నారు. ఎడపల్లి మండలంలో వెయ్యి మంది రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా 644 మందికి పంపిణీ చేశామన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని కానీ తాము అధికారంలోకి రాగానే ఆహార భద్రత కార్డులు అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం 34 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీసీసీబీ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ రజిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని, సంఘ అభివృద్ధికి పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని శ్రీరామ గార్డెన్‌లో ఆదివారం ఆర్యవైశ్య పట్టణ సంఘం అనుబంధ సంఘాల విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1944న స్థాపించిన ఆర్యవైశ్య సంఘానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఆర్యవైశ్యులు అంటే సమాజంలో సేవకులకు మారుపేరుగా ఉంటారన్నారు. సంపద సృష్టించడంలో ముందుంటూ.. 80 శాతం పన్నులను ప్రభుత్వాలకు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో ముందున్న ఆర్యవైశ్యులు రాజకీయాల్లో వెనుకబడి పోతున్నారన్నారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం, అనుబంధ సంఘాల ఎన్నికల్లో ధర్మం గెలిచిందనడానికి ఎటువంటి సందేహం లేదన్నారు. నూతనంగా గెలిచిన వారి బాధ్యత మరింత పెరిగిందని.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్లలో పట్టణ ఆర్యవైశ్య సంఘంతో పాటు గల్లీ సంఘాల అభివృద్ధికి నిధులు ఇచ్చి




ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్, మాజీ ఎమ్మెల్యే బిగాల

తోడ్పాటు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా కూడా అంతకుమించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కొంతమంది సంఘ ఎన్నికల్లో ఒక వర్గానికి అనుకూలంగా ప్రోత్సహించినట్లు అపోహలు సృష్టించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**అక్షరటుడే, ఇందూరు:** విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహర్షి జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిస్వార్థంగా పనిచేసే వర్గంలో ఉపాధ్యాయులు ఉంటారని కొనియాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల పనితీరు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, బద్రీనాథ్, రాష్ట్ర బాధ్యులు రామకృష్ణారెడ్డి, కీర్తి సుదర్శన్, వరప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.




అక్షర టుడే
Web News
E-Paper
విలేకరులు కావలెను
అనతి కాలంలోనే మిలియన్ల మంది పాఠకులను సొంతం చేసుకుని.. డిజిటల్ మీడియాలో దూసుకెళ్తున్న అక్షరటుడేలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం ఉండి.. అనుభవజ్ఞులైన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆర్మూర్, బాల్కొండ, నందిపేట, కామారెడ్డి, వర్ని, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్‌లకు విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు 9010337369 నంబరును సంప్రదించగలరు
WWW.AKSHARATODAY.IN

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
ఆదివారం
27.7.2025

www.aksharatoday.in
AKSHARA TODAY



## ప్రారంభానికి నోచుకోని గ్రామ పంచాయతీ భవనం

నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లిలో అన్ని హంగులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సుమారు రెండు సంవత్సరాల కిందట భవనాన్ని అన్ని హంగులతో నిర్మించినా ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో చావిడిలోనే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా నూతన భవనాన్ని ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – అక్షరటుడే, నిజాంసాగర్

## జానకీ బాయి చెరువు పరిశీలన



**అక్షర టుడే, ఇందల్వాయి:** మండలంలోని సిర్నాపల్లి జానకి బాయి చెరువులో శనివారం రాత్రి ముగ్గురు యువకులు వరదలో చిక్కుకున్న విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకట్రావు, ఎస్సై సందీప్ ఆదివారం చెరువును పరిశీలించారు. వీడీసీ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. సందర్శకుల తాకిడి నేపథ్యంలో రక్షణ చర్యలు చేపడతామన్నారు. సందర్శకులు వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత, అలాగే రోడ్డు మార్గం మెరుగు పడిన అనంతరం రావాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## మహిళను మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్‌కు చెందిన ఓ దళిత మహిళను మోసం చేసిన వ్యక్తి సాయిలు, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీర్కూర్ కామప్ప చౌరస్తాలో ఆదివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు సంఘం డివిజన్ అధ్యక్షుడు మల్లూరి సాయిలు మాట్లాడుతూ.. బీర్కూర్‌కు చెందిన మహిళకు సాయిలు న్యాయం చేయాలని, ఆమెపై, కుటుంబ సభ్యులపై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మహిళ కుటుంబ సభ్యులపై దాడి చేసిన సాయిలు, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు బాల సాయిలు, బీర్కూర్ మాల సంఘం నాయకుడు కోరిమె రఘు, బాబయ్య, అడ్ల విశాల్, పిడుగు బస్వంత్, శ్రీకాంత్, శంకర్, నల్లజెరు బాలరాజ్, గైని శివ, పిడుగు వినోద్, ప్రవీణ్, సాయి, నల్లజెరు నవీన్, నల్లజెరు సాయిబాబా, ముడ లక్ష్మణ్, పాడిదేపు గోపి, నల్లజెరు శివకుమార్, నల్లజెరు బాలయ్య, నవీన్ పాల్గొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా నాలుగు రోజుల పాటు వాన దంచికొట్టింది. ఎడ తెరిపి లేకుండా వాన పడడంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షా లతో చెరువులు, ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ నగరంలో సహా పలు పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – అక్షరటుడే, నిజామాబాద్



# విస్తారంగా వర్షాలు.. ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో

**■ ఎస్సారెస్పీకి భారీగా ఇన్‌ఫ్లో ■ పోచారంలోకి పెరిగిన వరద ■ ఉధృతంగా ప్రవహిస్తున్ వాగులు**



స్థానికంగా కురుస్తున్న వర్షాలతో ఉత్తర తెలంగాణల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 52 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 24.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరోవైపు నిజాంసాగర్ ప్రాజెక్టుకు సైతం వరద స్వల్పంగా పెరిగింది. జలాశయంలోకి ప్రస్తుతం 1600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

### కల్యాణి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత

ఎల్లారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 మీటర్ల కాగా ప్రస్తుతం 408.50 మీటర్లకు చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

### పోచారం డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

గాంధారి, లింగంపేట, రాజంపేట, తాడ్వాయి, మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్‌లో కురిసిన భారీ వర్షాలతో నాగిరెడ్డిపేట శివారులోని పోచారం ప్రాజెక్ట్‌కు భారీగా వరద వస్తోంది. లింగంపేట పెద్దవాగు, గుండారం వాగుల ద్వారా డ్యామ్‌లోకి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 20.5 అడుగులు కాగా.. ప్రస్తుతం 15.3 అడుగులకు చేరుకుంది. వరద ఇలాగే కొనసాగితే ఒకటి రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నిండే అవకాశం ఉంది.

### ఉధృతంగా పారుతున్న వాగులు

వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని వాగులు ఉధృతంగా పారుతున్నాయి. సిరికొండలోని పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అమర్లబండ, దేమికాలన్ వాగులకు భారీగా వరద వస్తోంది. లింగంపేట పెద్దవాగు, తాడ్వాయి మండలంలో భీమేశ్వర వాగు, రాజంపేట మండలంలో గుండారం వాగులు సైతం ఉధృతంగా పారుతున్నాయి.

పలు చోట్ల తాత్కాలిక రోడ్లు తెగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో చెరువులు నిండుకుండల్లా మారాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పురాణీపేట్‌లో ఉచిత వైద్య శిబిరం

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని శివసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని పురాణీపేట్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు సాయికుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడంపై ఆనందం వ్యక్తంచేశారు.. ఆస్పత్రి ప్రారంభించి ఐదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో 25వ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. క్యాంపులో సుమారు 80, మంది చిన్నారులకు,180 మంది పెద్దలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తోట శంకర్ బుర్ర దేవేందర్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు తోట శ్రీనివాస్, వైద్యులు జనరల్ సర్జరీ ఫిజీషియన్ సూర్య నారాయణ, చిన్న పిల్లల వైద్య నిపుణులు జైపాల్, శ్రీ వైద్య నిపుణులు ప్రదీప్తి, క్రిటికల్ కేర్ జనరల్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

## పిల్లలకు భగవద్గీత తరగతులు




**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు ఉచితంగా భగవద్గీత తరగతులు నిర్వహించారు. 50 మంది పిల్లలు భగవద్గీత క్లాసులకు హాజరై శ్లోకాలు నేర్చుకున్నారు. మాతాజీలు కంకణాల పవిత్ర, నార్ల భాగ్య ఉచితంగా క్లాసులు బోధించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శంకర్ గురుస్వామి మాతాజీలను, పిల్లలను అభినందించారు. సంస్కృతి సాంప్రదాయాలు పిల్లలకు నేర్పించి బావి భారత పౌరులుగా తయారు చేయాలని ఆయన కోరారు. చిన్నప్పటి నుంచి పిల్లలకు భగవద్గీత నేర్పాలని, పిల్లల్లో మనోధైర్యం కలుగుతుందని చెప్పారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు

**అక్షరటుడే ఇందల్వాయి:** సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామ శివారులో ఓ వ్యక్తిని హత్య చేసి చెరువుకట్ట పక్కన పడేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మైలారం గ్రామంలో సీసీ ఫుటేజీని పరిశీలించి ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు మధ్యలో మృతదేహాన్ని తీసుకువెళ్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. రికార్డుల ఆధారంగా లాయక్ బబ్లు, అబ్దుల్ జబ్బర్ అనే నిందితులను అరెస్టు చేసినట్లు ధర్పల్లి సీఐ భిక్షపతి తెలిపారు. ఖాజా మొయినుద్దీన్‌ను హత్య చేసిన ఇద్దరు నిందితులను రెండు రోజుల్లోనే పట్టుకొని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. రెండు రోజుల్లో కేసు ఛేదించిన సీఐ భిక్షపతి, సిరికొండ ఎస్సై రామకృష్ణ, పోలీసులను నిజామాబాద్ ఏసీపీ అభినందించారు.


## గల్ఫ్ నుంచి నేరడి భోజన్న మృతదేహం తరలింపు

**మృతదేహాన్ని తరలింపునకు హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సహాయం**



**అక్షరటుడే, ఇందల్వాయి:** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి గ్రామానికి చెందిన నేరడి భోజన్న గల్ఫ్‌లో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సహాయం చేసింది. భోజన్న కుటుంబ పోషణ కోసం 25 రోజుల క్రితం దుబాయ్‌కి వెళ్లాడు. కాగా.. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించగా గుండెపోటుతో మృతి చెందాడు. అయితే కంపెనీ స్పందించకపోవడంతో మృతుడి తమ్ముడు హరిదాస్ వెంటనే తెలుగు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్‌ను సంప్రదించారు. దీంతో వారు కంపెనీకి చెందిన ప్రతినిధులతో మాట్లాడి.. మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశారు. ఆదివారం మృతదేహాన్ని షార్జా నుంచి హైదరాబాద్‌కు పంపించారు. హైదరాబాద్ నుంచి ఇందల్వాయి వరకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు.

## తండ్రి దినకర్మ రోజే కొడుకు మృతి



**అక్షరటుడే, బోధన్:** ప్రమాదవశాత్తు చెరువులో పడి తండ్రి మృతి చెందగా, తండ్రి దశ దినకర్మ రోజునే కొడుకు అనారోగ్యంతో మృతి చెందిన ఘటన ఎడపల్లిలో జరిగింది. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన సాయల్ల మల్లయ్య బుధవారం పశువులను మేపేందుకు వెళ్లి చెరువులో దిగగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. ఆదివారం ఇంట్లో దినకర్మకు ఏర్పాట్లు చేస్తుండగా, శనివారం సాయంత్రం మల్లయ్య కుమారుడు భానుప్రకాష్ (30) అనారోగ్యంతో మృతి చెందాడు. నాలుగు రోజుల వ్యవధిలో తండ్రి, కొడుకు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఆర్మూర్ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పద్మశాలి సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 8 తర్పల సంఘాలతో ఏర్పడిన పట్టణ సంఘానికి అధ్యక్షుడిగా మ్యాక మోహన్ దాస్ ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా కొక్కుల రమాకాంత్, కోశాధికారిగా బత్తుల భాస్కర్, సర్వ సమాజ్ ప్రతినిధిగా కొక్కుల విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మోహన్‌దాస్ మాట్లాడుతూ.. పద్మశాలిల సంక్షేమం కోసం కృషి చేస్తానని, నిర్మాణంలో ఉన్న పట్టణ కమ్యూనిటీ భవనం పనులు సకాలంలో పూర్తి చేస్తానన్నారు. కార్యవర్గం సహకారంతో, అన్ని తర్ప అధ్యక్షుల సలహాదారుల సూచనలతో సంఘ అభివృద్ధికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ త్రివేణి గంగాధర్, చిట్ల ప్రకాష్, తాళ్ల హరిచరణ్, చౌకి లింగం, అంబళ్ల శ్రీనివాస్, తర్పల అధ్యక్షులు అంబటి, బండి అనంతరావు, చిట్ల యగ్నేష్, రుద్ర రాజేశ్వర్, సైబ సుధాకర్, వేముల ప్రకాష్, సదామస్తుల గణపతి, కొక్కుల రమాకాంత్, కాండీ ధర్మపురి పాల్గొన్నారు.



## వర్షానికి నేలకొరిగిన వృక్షం..

**అక్షరటుడే, లింగంపేట:** రెండురోజులుగా కురిసిన వర్షానికి మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కేకేవై రహదారిపై భారీ మర్రి వృక్షం నేలకొరిగింది. కాగా, భారీ వృక్షాలకు నిప్పు.. పొంచి ఉన్న ముప్పు అనే శీర్షికన ఇటీవల 'అక్షరటుడే'లో కథనం ప్రచురితమైంది. అయినా, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండురోజులుగా వర్షం కురవడంతో ఆదివారం మర్రి చెట్టు విరిగిపడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన ఎస్సై ప్రదీప్‌కుమార్ చేరుకుని విరిగిపడిన చెట్టును తొలగింపజేశారు. దీంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ముందే హెచ్చరించినా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికైనా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## పోతంగల్ చెక్‌పోస్టు వద్ద కంకర లారీ బోల్తా..

**అక్షరటుడే, కోటగిరి:** కంకర లారీ బోల్తా పడిన ఘటన పోతంగల్ చెక్‌పోస్టు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ నుంచి కోటగిరి మండలం ఎత్తొండ వెళ్తున్న లారీ ఆదివారం ఉదయం బోల్తా పడింది. కెనాల్ వర్క్ కోసం కంకరతో వెళ్తున్న లోడ్ లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. బీర్కూర్ మంజీర బ్రిడ్జి నుంచి వెళ్తుండగా పోతంగల్ చెక్ పోస్ట్ వద్ద ఈ ఘటన జరిగింది. బ్రేక్ వీల్ పని చేయకపోవడంతో 33 కేవీ 11 కేవీ స్తంభాలను ఢీ కొట్టడంతో విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాంద్ పాషాకు ఎలాంటి గాయాలు కాలేదు. చెక్‌పోస్టు సమీపంలో గతంలోనూ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సమీపంలో ఉన్న కాలువపై కల్వర్టుకు సైడ్‌వాల్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుపై సైడ్‌వాల్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.